# వెర్రి అభిమానం

కోలపల్లి ఈశ్వర్



"మా వీరబాబు సినిమా 'అప్పన్న' రెండొందల సెంటర్లలో నాలుగొందల రోజులుగా ఆడుతోంది తెలుసా?" అన్నాడు రవి.

"మీ బోడి హీరో సంగతి చెబుతున్నావా? మా అభిమాన హీరో బుల్లెబ్బాయ్ సినిమా 'దిబ్బయ్య' విడుదలైన వారం రోజుల్లోనే రెండు కోట్ల కలెక్షనొచ్చింది తెలుసా?", అన్నాడు రాము.

"ఆ డిప్పగాడి సినిమా చూసేది బుర్రలేనివాళ్లే" అన్నాడు రవి.

"మా హీరోని డిప్పగాడంటావా?" పైపైకి వచ్చాడు రాము.

"మా హీరోని బోడి హీరో అనెందుకన్నావ్?" చేయెత్తాడు రవి.

మాటా మాటా పెరిగింది. ఇద్దరూ తమ హీరో గొప్ప అంటే తమ హీరో గొప్ప అని వాదులాడుకున్నారు. పది నిముషాల్లో గొడవ ముదిరి, ఒకరినొకరు కొట్టుకుని గాయాలతో మూలుగుతూ పడిపోయారు.

వారిద్దర్నీ ఆసుపత్రికి తీసుకువెళ్లి వైద్యం చేయించి ఆటోలో తిరిగి ఇంటికి తీసుకువస్తున్న గోపాలం మాష్టారు, దారిలో ఒకచోట ఆటోను ఆపించి, రవినీ, రామూను దిగమని చెప్పారు.

ఇద్దరూ కాళ్లకి చేతులకీ బ్యాండేజ్‌లతో కొద్దిగా కుంటుతూ గోపాలంను అనుసరించారు.

ఎదురుగా మైదానంలో పెద్ద పెద్ద టెంట్లు వేయబడి ఉన్నాయి. పూలహారాలతో, మామిడాకుల తోరణాలతో అలంకరించబడిన స్టేజీపై ఎవరో ఒక వ్యక్తి ఉపన్యాసం ఇస్తున్నాడు.

స్టేజీ ముందు వేలాదిమంది జనం ఉన్నారు. ఒక పక్కగా వెళ్లి నిలబడ్డారు ముగ్గురూ. మైకులో మాటలు వినబడుతున్నాయి. "ఈరోజు ఇక్కడ మా ఉచిత కంటి ఆసుపత్రి ప్రారంభం సందర్భంగా మా మిత్రులైన ఇద్దరు సినీ హీరోలను పిలవగానే వాళ్ళు సహృదయంతో అంగీకరించి వచ్చినందుకు కృతజ్ఞతలు.

ముందుగా ప్రకటిస్తే లక్షలాది జనం వస్తారనీ, వాళ్లని మేనేజ్ చేయడం కష్టమనీ ఈ విషయం ఎవ్వరికీ తెలియనివ్వలేదు. ఆ ఇద్దరు ఎవరంటే ప్రముఖ హీరోలు వీరబాబు మరియు బుల్లెబ్బాయ్. వారినిప్పుడు స్టేజీపైకి ఆహ్వానిస్తున్నాం".

ఈ మాటలు వినగానే కేరింతలతో, చప్పట్లతో ఆ మైదానం మారుమోగిపోయింది.

రవి, రాము మొహాలు ఆనందంతో ఆశ్చర్యంతో వెలిగిపోయాయి. ఇద్దరూ "హేయ్ హేయ్" అంటూ గెంతులేయబోయారు. కానీ వళ్లంతా నొప్పులు కాబట్టి వీలుకాలేదు.

అంతలో వీరబాబు, బుల్లెబ్బాయ్ ఇద్దరూ కలిసి నడుస్తూ ఒకేసారి స్టేజి పైకి వచ్చి,

# పాఠకుల కోసం ప్రత్యేక శీర్షికలు

**ప్రియదత్త** సకుటుంబ సచిత్ర వారపత్రికలో, పాఠకులు కూడా పాల్గొనడానికి అవకాశం కల్పించే కొన్ని ప్రత్యేకమైన శీర్షికలను ప్రచురిస్తున్నాము. ఈ క్రింద పేర్కొన్న శీర్షికలలో దేనిని గురించైనా పాఠకులు తమ అనుభవాలను అరఠావు పేజికి మించకుండా వ్రాసి పంపవచ్చును. మాకు అందిన రచనలలో ప్రచురణ యోగ్యంగా వున్నవాటిని స్వీకరించి పంపినవారి ఫోటో చిరునామాలతో ప్రచురిస్తాము. ప్రచురించిన ప్రతి రచనకు పారితోషికం అందజేస్తాము.

## శీర్షికలు :

1. మరపురాని సంఘటన.
2. మోసపోయిన సందర్భం.
3. కథకాని కథ. (మీ అనుభవంలోని విచిత్రమైన వింత సంఘటన).
4. టెలివిజన్‌లో మీరు చూస్తున్న సీరియల్స్‌పై మీ అభిప్రాయాలు.
5. మీ ప్రాంతంలో ఏం జరుగుతోంది / జరగడంలేదు.
6. నేను చూసిన మొదటి సినిమా.
7. నాకు నచ్చిన ఉద్యోగం / వృత్తి / వ్యాపారం.
8. మావారితో / ఆవిడతో తొలి పరిచయం.
9. మా ఇంట్లో "చిచ్చర పిడుగు" మీ ఇంట్లో పిల్లలతో జరిగిన మరువలేని అద్భుతమైన అనుభవం.

మీ రచనలను - సంపాదకుడు, ప్రియదత్త సచిత్ర వారపత్రిక, పోస్ట్ బాగ్ నెం. 399, మైలాపూర్, చెన్నై - 600 004. చిరునామాకు పంపగోరుతున్నాము.

- సం.

కరచాలనం చేసుకుని, కౌగిలించుకుని, చేతులెత్తి జనం వైపు చూస్తూ చేతుల్ని గాలిలో ఊపారు. మరోసారి చప్పట్లు.... తరువాత ఇద్దరూ తమ తమ సీట్లలో కూర్చున్నారు.

వీరబాబు మాట్లాడుతూ ఆసుపత్రి ప్రారంభానికి బుల్లెబ్బాయ్ రావడం తనకెంతో ఆనందం కలిగించిందన్నాడు. బుల్లెబ్బాయ్ కూడా తన ఉపన్యాసంలో వీరబాబు తనకు మంచి స్నేహితుడని చెప్పాడు. ఆ తరువాత సమయం ఎక్కువగా లేనందున అందరికీ వీడ్కోలు పలికి స్టేజీ దిగి వచ్చి ఇద్దరూ ఒకే కారులో అక్కడినుండి వెళ్ళిపోయారు.

గోపాలం మాస్టారు రవినీ, రామునీ చూస్తూ ఇలా అన్నాడు.

"చూశారా! మీరిద్దరూ ఎవరి గురించైతే తిట్టుకొని, కొట్టుకొని, ఈ స్థితికొచ్చారో.... వారిద్దరూ మంచి మిత్రులు. వాళ్ళకు ఒకరంటే మరొకరికి కోపం లేదు. ఇద్దరూ ఒకరి నొకరు గౌరవించుకున్నారు. మీరేమో వారి గురించి తగువులాడుకున్నారు. ఒకేయ్! నటన అనేది వారిద్దరి వృత్తి. నటిస్తే నటిస్తారు. సినిమాలో కథ, పాటలు, నృత్యాలు అన్నీ బాగుంటే సినిమా బాగా ఆడి వాళ్లకు పేరొస్తుంది. వాళ్లని అభిమానిస్తే తప్పు లేదు. కానీ ఆ అభిమానం ఇలా వెర్రిగా మారితే మీకే నష్టం వాళ్ల గురించి మీరు కాళ్లూ చేతులు విరగ్గొట్టుకున్నారు. కానీ మీ గురించి వాళ్లకు తెలుసా? అందుకే ఇప్పటికైనా నిజం తెలుసుకుని మీరు ఎలా గొప్ప వాళ్లవుతారో ఆలోచించండి. మిమ్మల్ని మీరు అభిమానించుకోండి".

ఈ మాటలు విన్న రవి, రాము తమ అజ్ఞానానికి సిగ్గుపడి తలదించుకున్నారు.

"నిజమే మాస్టారూ! ఇకనుంచీ వృధాగా కాలాన్ని పాడు చేయకుండా, జీవితంలో పైకి రావడానికి కృషి చేస్తాం" అన్నారు ఇద్దరూ.

❋

